వైద్యులు సమయపాలన పాటించాలి: కలెక్టర్

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 10 : వైద్యులు సమయపాలన పాటించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సూచించారు. డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిని గురువారం ఆయన సందర్శించి, వైద్యుల హాజరు, ఓపీ రిజిస్టర్లను పరిశీలించారు. వార్డుల్లో తిరిగి పేషెంట్లతో మాట్లాడారు. ప్రతి రోజూ వైద్యులు వస్తున్నారా.. మందులు ఇస్తున్నారా, ఆహారం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఐసీటీసీలో నిర్వహిస్తున్న రక్త పరీక్షల గురించి ఎల్‌టీ కరుణాకర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో వైద్యులు నిర్లక్ష్యం వహించొద్దన్నారు. వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను రోగులకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో డీఎస్ వెంకన్న, తహసీల్దార్ డీ వెంకటేశ్వర్లు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.సుధీర్, డా. జనార్దన్, డా. సౌఖ్య, డా. సంధ్య, డా. అజయ్, డా. ఆనందరావు, డీపీఎంవో మురహరి తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే

కొడకండ్ల, అక్టోబర్ 10: మండల కేంద్రంలో నవబంజార యూత్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన కబడ్డీ టోర్నమెంటులోని విజేతలకు పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి గురువారం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీఎన్ చారిని సన్మానిస్తున్న యూనివర్సిటీ ప్రముఖులు

డాక్టర్ వీఎన్ చారికి సన్మానం

దేవరుప్పుల, అక్టోబర్ 10: చాకలి అయిలమ్మ తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంలో గురువారం జరిగిన స్నాతకోత్సవ వేడుకల్లో దేవరుప్పుల గ్రామానికి చెందిన డాక్టర్ చిలుమోజు వెంకటనరసింహాచారిని పలువురు ప్రముఖులు సన్మానించారు. ఉస్మానియాలో డాక్టరేట్ పొందిన ఆయన ప్రస్తుతం మహిళా విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ మామిడాల జగదీష్ కుమార్, హయ్యర్ ఎడ్యుకేషనల్ చైర్మన్ లింబాద్రి, ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం గౌడ్, యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ విద్యుల్లత చేతుల మీదుగా వీఎన్ చారిని సత్కరించారు. పేదరికం నుంచి కష్టపడి చదివిన వీఎన్ చారి అంచెలంచెలుగా ఎదగడంపై గ్రామస్తులు అభినందించారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌కు రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్

జనగామ చౌరస్తా, అక్టోబర్ 10: జిల్లాలోని స్టేషన్ ఘన్‌పూర్‌కు రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ మంజూరైనట్లు గురువారం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పథకం కింద మొదటి విడత 28 పాఠశాలలు మంజూరుకాగా, అందులో స్టేషన్ ఘన్‌పూర్ ఒకటి కావడం విశేషం అని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కృషితో జిల్లాలో రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

లింగాలఘనపురం, అక్టోబర్ 10: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై దవాఖానలో చికిత్స పొందుతూ వడిచర్లకు చెందిన ఓ వ్యక్తి గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వట్టిపెల్లి వీరస్వామి(38) జనగామలో హమాలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 2వ తేదీన బతకమ్మను పేర్చడానికి పూల కోసం కొత్తపెల్లి రూట్లో టేకు చెట్టు ఎక్కగా పక్క నుంచి వెళ్తున్న విద్యుత్ తీగలు తాకి షాక్‌కు గురై కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు వీరస్వామిని హైదరాబాద్‌లోని దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

బచ్చన్నపేట, అక్టోబర్ 10: మండలంలోని కొన్నె గ్రామంలో తేలు నర్సయ్య అనారోగ్యంతో మృతి చెందగా, ఆ కుటుంబాన్ని గురువారం బీఆర్ఎస్ నేత, సామాజిక సేవా కార్యకర్త కోడూరి శివకుమార్‌గౌడ్ పరామర్శించారు. ఈ సందర్భంగా అంత్యక్రియల నిమిత్తం రూ. 5 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో సిద్దిరాములు, రామచంద్రయ్య, ఇస్తారి, శ్రీనివాస్, కిష్టయ్య, దశరథ, బైరయ్య, ఐలయ్య, పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందిస్తున్న శివకుమార్‌గౌడ్

జనగామలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

నర్మెటలో బతుకమ్మలతో వస్తున్న మహిళలు

బచ్చన్నపేట, లింగాలఘనపురం చెరువు గట్టుపై బతుకమ్మ ఆడుతున్న ఆడపడుచులు

ఊరూవాడా.. పూల వనం

- మా తల్లీ బతుకమ్మా.. వెళ్లిరా గౌరమ్మా
- వైభవంగా సద్దుల బతుకమ్మ
- అంబరాన్నంటిన సంబురాలు
- ముగిసిన తీరొక్క పూల జాతర
- జనగామ బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి దంపతులు

జనగామ, అక్టోబర్ 10(నమస్తే తెలంగాణ): సద్దుల బతుకమ్మ సంబురం గురువారం జిల్లాలో అంబరాన్నంటింది. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను చాటుకున్నారు. బతుకమ్మలతో మహిళలు బతుకమ్మకుంట, బాణాపురం మైదానాల వద్దకు వేల సంఖ్యలో తరలివచ్చారు. బతుకమ్మ పాటలు, వేలాది చప్పట్లతో మార్మోగింది. 'ఇస్తినమ్మా వాయినం..పుచ్చుకుంటినమ్మా వాయినం' అనుకుంటూ మహిళలు అందరూ ఒక్కచోట చేరి ప్రసాదం పంచుకున్నారు. 'మాయమ్మ..లక్ష్మీ దేవి పోయి రావమ్మా..' అంటూ గౌరమ్మను భక్తిశ్రద్ధలతో గంగమ్మ ఒడికి చేర్చారు. బతుకమ్మకుంటలో ఒగ్గుడోలు కళాకారుల విన్యాసాలతో బతుకమ్మలతో వచ్చే మహిళలకు ఘనస్వాగతం పలికారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి–నీలిమ దంపతులు, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ దంపతులు వేడుకల్లో పాల్గొని ఆడిపాడారు.జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా డీసీపీ రాజ మహేంద్రనాయక్ ఆదేశాల మేరకు అంతటా పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. అదేవిధంగా జనగామ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి సతీమణి నీలిమ, తల్లి సహా బీఆర్ఎస్ మహిళా నాయకులు చెంచారపు పల్లవి, శారద, పేర్ని స్వరూప తదితరులు ఆడిపారు.

వర్షంతో ఆటంకం

లింగాలఘనపురం/జఫర్‌గఢ్/కొడకండ్ల/నర్మెట/బచ్చన్నపేట/రఘునాథపల్లి/తరిగొప్పుల/పాలకుర్తి/స్టేషన్‌ఘన్‌పూర్/చిలూరు/జనగామ చౌరస్తా: పలు గ్రామాల్లో వర్షంతో బతుకమ్మ ఆడేందుకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. జఫర్‌గఢ్, సాగరం, కూనూరు, ఉప్పుగల్లు, తమ్మడపల్లి(జి), తిడుగు, కోనాయిచలం గ్రామాల్లోని చెరువుల వద్ద బతుకమ్మ పండుగను మహిళలు సంతోషంగా జరుపుకున్నారు. నర్మెట, వెల్దండ, మచ్చుపహాడ్, హన్మంతాపూర్, కన్నెబోయిన గూడెం, బొమ్మకూర్ తదితర గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, చెరువు కట్టల వద్ద మహిళలు బతుకమ్మ ఆడి నిమజ్జనం చేసి వాయినం ఇచ్చి పుచ్చుకున్నారు. బచ్చన్నపేట మండలంలోని గోపాల్‌నగర్‌లోజడ్పీ మాజీ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి కుటుంబసభ్యులతో కలిసి బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్నారు. పాలకుర్తి ఊరచెరువు వద్ద నిర్వహించిన సద్దుల బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. స్టేషన్ ఘన్‌పూర్‌లో ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు ఏర్పాటు చేశారు.

దేవరుప్పులలో బతుకమ్మతో మహిళలు

తరిగొప్పులలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

స్టేషన్‌ఘన్‌పూర్: చాగల్లు, సాగరంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

చిల్పూర్: మల్కాపూర్ గ్రామంలో బతుకమ్మలతో మహిళలు

పాలకుర్తి: గూడూరులో..

రెండు వ్యవసాయ మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలు

- జనగామ చైర్మన్‌గా శివరాజ్‌యాదవ్, స్టేషన్‌ఘన్‌పూర్‌కు లావణ్య

శివరాజ్‌యాదవ్, వైస్ చైర్మన్లు శివకుమార్ జూలుకుంట్ల లావణ్య, నూకల ఐలయ్య

జనగామ, అక్టోబర్ 10(నమస్తే తెలంగా ణ): జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బనుక శివరాజ్ యాదవ్ నియమి తులయ్యారు. ఈమేరకు చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ సహా మొత్తం 14 మంది సభ్యులతో పాలకవర్గం నియామకానికి సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ గురువారం అధికారికంగా ప్రకటించారు. జనగామ మండలం శామీర్‌పేటకు చెందిన శివరాజ్ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ముఖ్య అనుచరుడిగా జిల్లా యూత్ కాంగ్రెస్‌లో చురుకైన పాత్ర పోషించాడు. వైస్ చైర్మన్‌గా లింగాలఘనపురం మండలం వడిచర్లకు చెందిన కొల్లూరి నర్సింహులు (శివకుమార్) సహా శీలం కొండల్‌రెడ్డి, బానోత్ బన్సీ, నామాల శ్రీనివాస్, బొట్ల నర్సింగరావు, బుట్రెడ్డి శ్రీలతారెడ్డి, మహ్మద్ బాషామియా, నీలం మోహన్, బండ కుమార్, తోట కూర రమేశ్, గాదె రమేశ్, వనపర్తి శ్రీనివాస్, నాగబండి రవీందర్‌ను డైరెక్టర్లుగా నియమించింది. వీరితో పాటు జనగామ పీఏసీఎస్ చైర్మన్, జిల్లా మార్కెటింగ్ అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి, జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎక్స్‌అఫీషియో సభ్యులుగా వ్యవహరిస్తారు. ఉత్తర్వులు వెలువడిన నాటి నుంచి రెండేళ్లకాలం వరకు పాలకవర్గం కొనసాగుతుంది.

మండలం నుంచి నలుగురికి చోటు

రఘునాథపల్లి: జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా మండల కేంద్రానికి చెందిన ఎండీ బాషామియా, బంద కుమారస్వామి(కోమల్ల), గాదె రమేశ్(ఖిలాషాపురం), తోటకూరి రమేశ్‌యాదవ్(కుర్చపల్లి)కు చోటు దక్కింది. తమ నియామకానికి సహరించిన నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

వైస్ చైర్మన్‌తోపాటు ఇద్దరికి డైరెక్టర్ పదవులు

లింగాలఘనపురం: వడిచర్లకు చెందిన కొల్లూరి శివకుమార్(నరసింహులు)కు ఏఎంసీ వైస్‌చైర్మన్‌గా, లింగాలఘనపురానికి చెందిన నీలం మోహన్, బుట్రెడ్డి శ్రీలతారెడ్డిలకు డైరెక్టర్లుగా అవకాశం కల్పించారు. కాగా శివకుమార్‌ను నాయకులు దామెర నాగరాజు, బత్తిని అశోక్ కుమార్‌గౌడ్, కొత్తకొండ గంగాధర్, దామెర ప్రభాకర్, ఓరుగంటి రాజు, సాగర్, సాయికుమార్ తదితరులు అభినందించారు.

మార్కెట్ చైర్‌పర్సన్‌గా జూలుకుంట్ల లావణ్య

స్టేషన్ ఘన్‌పూర్: స్టేషన్ ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా మండలంలోని రంగరాయ గూడేనికి చెందిన జూలుకుంట్ల లావణ్యా శిరీష్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా జఫర్‌గఢ్ మండలం తిమ్మంపేటకు చెందిన నూకల ఐలయ్యతోపాటు 12 మంది కమిటీ సభ్యులు నియామకం అయ్యారు. సభ్యులుగా భూక్య సురేశ్, మాదిరెడ్డి యశ్వంత్ రెడ్డి, నీల వెంకటేశ్వర్లు, భాస్కుల కిరణ్, మారపాక వసంత్, మహ్మద్ ఆయూష్ బేగం, కాసాని బొందయ్య, ఇల్లందుల బాబు, పేరాల సుధాకర్, మాచర్ల కుమారస్వామి, గోళి శ్రీనివాస్, వెల్మజాల రాంరెడ్డిని నియమించారు.

వైస్ చైర్మన్‌ను అభినందించిన ఎమ్మెల్యే కడియం

జఫర్‌గఢ్: స్టేషన్‌ఘన్‌పూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమితులైన ఐలయ్య ఎమ్మెల్యే కడియం శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీహరి ఐలయ్యను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ తీగల కర్ణాకర్‌రావు, రాజేశ్ నాయక్, ఇల్లందుల శ్రీనివాస్, సత్తిరెడ్డి తదితరులున్నారు.

డీఈవో ఆఫీసులో 178 మంది అభ్యర్థుల రిపోర్ట్

జనగామ చౌరస్తా, అక్టోబర్ 10: డీఎస్సీ ద్వారా జిల్లాలో కొత్తగా స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులుగా నియామక పత్రాలు అందుకున్న 199 మంది అభ్యర్థుల్లో గురువారం జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో 178 మంది రిపోర్ట్ చేసినట్లు డీఈవో కే రాము తెలిపారు. మిగతా 21 మంది శుక్రవారం రిపోర్ట్ చేయాలన్నారు.

సౌజన్యను అభినందిస్తున్న మాజీ సర్పంచ్ తదితరులు

టీచర్‌గా ఎంపికైన సౌజన్యకు అభినందన

బచ్చన్నపేట, అక్టోబర్ 10: ప్రభుత్వం నిర్వహించిన 2024 డీఎస్సీలో ప్రతిభ చూపి స్పెషల్ ఎడ్యుకేషన్‌లో ఎస్జీటీగా ప్రభుత్వ ఉద్యోగం సాధించిన మండలంలోని ఆలీంపూర్‌కు చెందిన తేలుకంటి సౌజన్యను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ పర్వతం కవితాతిరుపతి మాట్లాడుతూ సౌజన్య ప్రభుత్వ ఉద్యోగం సంపాదించి తల్లిదండ్రులు, ఊరుకు మంచి గుర్తింపు తెచ్చిందని అన్నారు. కార్యక్రమంలో బీబీజేఈడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి, చింతల నర్సయ్య, సౌజన్య తల్లిదండ్రులు మురళీవిజయ తదితరులు పాల్గొన్నారు.

మండలం నుంచి ఇద్దరికి ప్రభుత్వ ఉద్యోగాలు

జఫర్‌గఢ్: మండలంలోని సాగరం, జఫర్‌గడ్ శివారు వడ్లగూడెం గ్రామాలకు చెందిన తాటికాయల సుజిత్ కుమార్, శిరంశెట్టి శ్రీధర్‌లు డీఎస్సీ ఫలితాల్లో ఉత్తమ ర్యాంక్‌లు సాధించి ప్రభుత్వ కొలువులకు ఎంపికయ్యారు. సుజిత్‌కుమార్ బయలాజికల్ సైన్స్, శిరంసెట్టి శ్రీధర్ వ్యాయామ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. నిరుపేద కుటుంబాలకు చెందిన వారు కష్టపడి కొలువులు సాధించడంపై పలువురు అభినందించారు.

క్రికెట్ టోర్నమెంట్స్ ప్రారంభం

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 10: చిల్పూర్ బుగులు వేంకటేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్, పొట్లపల్లి శ్రీధర్‌రావు తండ్రి చక్రధర్ రావు జ్ఞాపకార్థం గురువారం పల్లగుట్ట గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్స్‌ను ప్రారంభించారు. పల్లగుట్ట యువత కోరిక మేరకు గ్రామ స్థాయి క్రికెట్, టెన్నిస్ టోర్నమెంట్స్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్స్‌ను చిల్పూర్ ఎస్సై నవీన్‌కుమార్‌తో కలిసి శ్రీధర్ రావు ప్రారంభించారు. అనంతరం భారత దేశ పారిశ్రామిక రంగాన్ని ప్రపంచ నలుమూల విస్తరింప చేసిన రతన్ టాటా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వైభవంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

పాలకుర్తి, అక్టోబర్10: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమేశ్వర లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో దుర్గాదేవిఅలంకరణలో పార్వతీ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి పంచామృత అభిషేకం, కుంకుమార్చన, చండీ హోమం నిర్వహించారు.

సామూహిక హోమాలు

లింగాలఘనపురం: మండలంలోని మాణిక్యపురంలో గురువారం భక్తులు సామూహిక చండీ హోమాలు చేశారు. పురోహితుడు గంగు సాంబమూర్తి ఆధ్వర్యంలో పూజలు జరుగగా, బండ ఆంజనేయులు, చౌదరపెల్లి సతీశ్, విజయభాస్కర్, నాగరాజు పాల్గొన్నారు.

పిల్లలకు నోట్‌బుక్స్ అందించిన సీఐ

జనగామ చౌరస్తా: జనగామ పట్టణంలోని గుండ్లగడ్డ ఉమా మహేశ్వర దేవాలయంలో దుర్గామాతను అర్బన్ సీఐ దామోదర్‌రెడ్డి దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజ లు చేసి వేద పండితుల ఆశీర్వచనాలు తీసుకున్నారు. స్థానిక చిన్నారులకు నోట్ బుక్స్, పెన్నులు సీఐ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామిని శ్రీనివాస్, ప్రకాశ్, కాచం నర్సింగరావు, విజయ్, రాజు, శ్రీకాంత్, పవన్, నీల, జ్యోతి, రాణి, రమ పాల్గొన్నారు.

బతుకమ్మ అలంకరణలో ఉప్పలమ్మ

జనగామ, అక్టోబర్ 10(నమస్తే తెలంగాణ) : జనగామ పట్టణంలోని ప్రముఖ అమ్మబావి ఉప్పలమ్మ తల్లి గురువారం బతుకమ్మ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా దేవా దాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన వేడకల్లో కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఆలయ ఈవో రాములు, అర్చకులు పవన్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని బతుకమ్మ రూపంలో అలంకరించారు. బతుకమ్మ అలంకణలో దర్శనం ఇచ్చిన ఉప్పలమ్మ తల్లిని చూసి భక్తులు పరవశించిపోయారు.

అప్పు చేసి జీతాలు చెల్లిస్తున్న జీపీ సిబ్బంది

అప్పులు తెచ్చి జీపీ సిబ్బందికి జీతాలు

పంచాయతీ కార్యదర్శుల తిప్పలు

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 10: మండలంలోని పలు గ్రామాల్లో పంచాయతీ కార్మికులకు కార్యదర్శులు అప్పులు తెచ్చి జీతాలు చెల్లిస్తున్నారు. స్టేషన్ ఘన్‌పూర్ గ్రామ పంచాయతీలో 32 మంది కార్మికుల జీతాలు రూ. మూడు లక్షలను గత నెల 30న బ్యాంకులో పంచాయతీ కార్యదర్శి జమ చేశారు. బుధవారం రాత్రి వరకు కూడా వారి ఖాతాలో జమ కాకపోవడంతో గురువారం జీతాలు రాకుండా సద్దుల బతుకమ్మ, దసరా పండుగలను ఎలా జరుపుకోవాలంటూ అధికారులను అడిగారు. దీంతో మధ్యాహ్నం వరకు రూ. లక్ష అప్పు తీసుకొచ్చి కార్మికులకు కొంత వరకు చెల్లించారు. గురువారం రాత్రి కానీ, శుక్రవారం వరకు కార్మికుల ఖాతాలో జీతాలు జమవుతాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు పేర్కొన్నారు.

శివునిపల్లి గ్రామ ప్రత్యేకాధికారిగా పాపయ్య

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 10: జనగామలో చీఫ్ ప్లానింగ్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న పాపయ్య శివునిపల్లి గ్రామ ప్రత్యేకాధికారిగా గురువారం బాధ్యతలు చేపట్టగా పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, జీపీ సిబ్బంది శాలువాతో సన్మానించారు. వివిధ పార్టీల నాయకులు చిగురు విజయ్, తోట రమేశ్, కంప్యూటర్ ఆపరేటర్ రాజు, సిబ్బంది లాజర్, యాకుబ్ పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారిని సన్మానిస్తున్న జీపీ సిబ్బంది

రతన్ టాటాతో గాదె గోపాల్ రెడ్డి (ఫైల్)

రతన్‌టాటాతో గోపాల్ రెడ్డి

కొడకండ్ల, అక్టోబర్ 10: ప్రముఖ పారిశ్రామిక వేత్త రతన్‌టాటా మరణంపై మండలంలోని రేగుల గ్రామానికి చెందిన గాదె గోపాల్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గోపాల్‌రెడ్డి అమెరికాలో ప్రముఖ గైనకాలజిస్ట్ కాగా, రతన్‌టాటా అమెరికా పర్యటన సమయంలో కలిశారు. టాటాతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్
వేలం కోసం బహిరంగ ప్రకటన
తాకట్టు బంగారు ఆభరణాల ఆస్తుల ఇ–వేలం కోసం బహిరంగ ప్రకటన

దిగువ ఖాతాలలో తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాల బహిరంగ వేలాన్ని దిగువ తెలిపిన బ్రాంచ్ వద్ద యాక్సిస్ బ్యాంక్ నిర్వహించుటకు ప్రతిపాదించిందని నిర్దేశిత రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది. దిగువ తెలిపిన రుణగ్రహీతలు సెక్యూరిటి నిమిత్తం బ్యాంక్ పేరున బంగారు ఆభరణాలు (బంగారు రుణ సౌకర్యం) తాకట్టుపై యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ నుండి రుణ సదుపాయాలను వినియోగించుకున్నారు. వినియోగించుకున్న బంగారు రుణ సౌకర్యం నిమిత్తం తమ బకాయి మొత్తాలను చెల్లించాల్సిందిగా రుణగ్రహీతలు/హామీదార్లను కోరుతూ రుణగ్రహీతలకు/హామీదార్లకు డిమాండ్ నోటీస్‌లు జారీ చేశారు. అయితే రుణగ్రహీతలు/హామీదార్లు బకాయి రుణ మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున తాకట్టు ఇన్‌వోక్ చేయుట బ్యాంక్‌కు తప్పనిసరి అయింది. మరియు ఆస్తి షెడ్యూల్‌లో మరింతగా వివరించిన తాకట్టు బంగారు ఆభరణాలను ''ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే మరియు అక్కడ ఏమున్నదో అదే మరియు రికోర్స్ పద్ధతి లేని విధంగా'' తేది: **21 అక్టోబర్, 2024న మ॥ 12.30 గం. నుండి మ॥ 3.30 గం. మధ్య** (ఇ–వేలం సమయం) ఇ–వేలం అమ్మకం నిర్వహించుటకు ప్రతిపాదించబడినది. **రుణగ్రహీతలు మరియు బకాయి మొత్తం వివరాలు:**

క్ర.సం.	బ్రాంచ్ పేరు	రుణ A/c నెం.	వినియోగదారు పేరు	బకాయి మొత్తం	డిమాండ్ నోటీస్ తేది	స్థూల బరువు	నికర బరువు
1	పరకాల TG	xxxxxxxxxxxxx2860	గడల శ్రావణ్ కుమార్	159698.9	24–సెప్టెంబర్–24	40.3	38.25
2	పరకాల TG	xxxxxxxxxxxxx8878	బొల్లారపు రమేష్	138070.6	24–సెప్టెంబర్–24	29	28.35
3	భూపాలపల్లి C0890 TG	xxxxxxxxxxxx4276	కోలా వినయ్	133742.3	24–సెప్టెంబర్–24	27.2	25.3
4	జనగాం WAR TG	xxxxxxxxxxxx2136	స్వర్గం రాజ్‌కుమార్	147997	22–జూన్–24	30	27

ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా ఖాతాను తొలగించుటకు/ వేలం తేదీని మార్చుటకు యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్‌కు అథారిటీ కలదు. వేలం ఆన్‌లైన్‌లో **https://gold.samil.in** (ఆన్‌లైన్ వెండార్ యొక్క వెబ్‌సైట్)లో **మ॥ 12.30 గం. నుండి మ॥ 3.30 గం.** మధ్య నిర్వహించబడును. సవివరమైన నియమనిబంధనల కొరకు వెబ్‌సైట్ **https://gold.samil.in** (ఆన్‌లైన్ వెండార్ యొక్క వెబ్‌సైట్)కు లాగిన్ కావలెను.

అధీకృత అధికారి, యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565